# సాక్షి
# భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024






**నిండుకుండలా తాలిపేరు**

ఖరీఫ్‌లో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు సాగునీరు అందించినా తాలిపేరులో ఇప్పటికీ 74 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. 8లో



**బొజ్జాయిగూడెంలో కిష్కింధకాండ**

బొజ్జాయిగూడెం రహదారిపై వానరాలు వాహనాలకు అడ్డుగా పరుగులు తీస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
27° / 15°

**వాతావరణం**

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదైనా.. తెల్లవారు జామున, రాత్రికి చలి తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### రేపటి నుంచి డీఈఎల్‌ఈడీ పరీక్షలు

**కొత్తగూడెంఅర్బన్:** ఈనెల 18వ తేదీ నుంచి డీఈఎల్‌ఈడీ(డిప్లొమా ఇన్ ఎల్మెంటరీ ఎడ్యుకేషన్) మొదటి సంవత్సరం పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 2023 – 25 బ్యాచ్ విద్యార్థులు, గత సంవత్సరాల్లో ఫెయిలై ఫీజు చెల్లించిన వారు హాజరు అవుతారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, పరీక్షల నిర్వహణకు కోర్టు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి రోజు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. వివరాలకు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు(99890 27943)ను సంప్రదించాలని సూచించారు.

### తాడ్వాయి అడవుల్లోకి పెద్దపులి !

**కరకగూడెం:** కొన్ని రోజులుగా కరకగూడెం మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచారం అనే ప్రచారం కలవరపెడుతుండగా ఫారెస్ట్ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో పెద్దపులి అడుగు జాడలను గుర్తించిన అధికారులు.. గతేడాది సంచరించిన దారిలోనే మళ్లీ పులి వచ్చినట్లు గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం కూడా పులి కోసం అన్వేషణ సాగించారు. అయితే సరిహద్దున ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి అటవీ ప్రాంతంలోకి పెద్దపులి వెళ్లి ఉంటుందని ఏడూళ్ల బయ్యారం రేంజర్ ఉపేందర్ 'సాక్షి'కి తెలిపారు. పెద్దపులి సంచారాన్ని అక్కడి రైతులు అధికారులకు తెలపగా వారు కూడా అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారని వివరించారు. కాగా పులి పాదముద్రల ఆధారంగా అది ఎటువైపు వెళ్లిందో తెలుసుకునేందుకు ఆరుగురు సభ్యులతో కూడిన 2 బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

### మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీగా సాయిమనోహర్

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెం అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా తాత్కాలిక విధులు నిర్వహిస్తున్న సాయిమనోహర్ నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ఆయనను మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీగా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### రేపు జాబ్‌మేళా

**సింగరేణి(కొత్తగూడెం) :** ఈనెల 18న కొత్తగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ (కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి, ఇల్లెందు) బ్రాంచ్‌ల్లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, ఇంటర్ డిగ్రీ, ఎంబీఏ చదివి 20 నుంచి 30 వయసు గలవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

## లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు

- చెక్కులు అందజేసిన ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

**కొత్తగూడెంఅర్బన్:** జిల్లా పోలీసుల ఎదుట ఇటీవల లొంగిపోయిన ఏడుగురు మావోయిస్టు పార్టీ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రివార్డు నగదును ఎస్పీ రోహిత్‌రాజ్ సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. బీజాపూర్ జిల్లా పామేడు పోలీసుస్టేషన్ పరిధి తుమ్రేల్ గ్రామానికి చెందిన పొడియం మంగుకు రూ.4లక్షలు, చర్ల మండలం కొరకట్పాడుకు చెందిన మడకం అడిమె అలియాస్ అనూషకు రూ.4లక్షలు, ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కోరం సోమయ్య అలియాస్ సోమకు రూ.లక్ష, సుకుమా జిల్లా డోకుపాడుకు చెందిన సొడ్డి పొజ్జి అలియాస్ చిలుకకు రూ.4 లక్షలు, మడివి సోమిడి అలియాస్ రమ్యకు రూ. 4లక్షలు, ఆళ్లపల్లి మండలం అడవిరామారం గ్రామానికి చెందిన మడకం ఇడుమకు రూ.లక్ష, చర్ల మండలం కిష్టారంపాడుకు చెందిన లక్ష్మయ్య అలియాస్ కలుకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ 2023 – 24 సంవత్సరంలో లొంగిపోయిన 26 మంది సభ్యులకు పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందన్నారు. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు అమాయక ఆదివాసీలను బలవంతంగా పార్టీలోకి చేర్చుకుంటున్నారని, వారితో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయిస్తున్నారని చెప్పారు. లొంగిపోయిన వారికి ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్, దుమ్ముగూడెం, చర్ల సీఐలు అశోక్, రాజువర్మ పాల్గొన్నారు.

# పినపాకకూ మోక్షం !

**సీతారామ ప్రాజెక్ట్ విస్తరణకు రంగం సిద్ధం**

- డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లతో నియోజకవర్గంలో కొంతమేర సాగునీరు
- కాల్వల తవ్వకానికి భూసేకరణ చేపట్టాలన్న ప్రభుత్వం
- నేటి నుంచి పెసా గ్రామసభల నిర్వహణ





సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ (ఇన్‌సెట్) బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్

**బూర్గంపాడు:** తలాపున గోదావరి ఉన్నా సాగు నీటికి ఇబ్బందులు పడుతున్న రైతులకు కొంతమేర ఊరట కలగనుంది. సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో గత, ప్రస్తుత ప్రభుత్వాలు పనులు చేపట్టాయి. గోదావరి జలాలను సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల భూములకు సాగునీరు అందించేలా పనులు నిర్వహిస్తున్న పాలకులు.. స్థానికంగా ఉన్న పినపాక నియోజకవర్గాన్ని విస్మరించారనే విమర్శలు వెల్లువెత్తాయి. రైతుల నుంచి స్థానిక ప్రజాప్రతినిధులపై కూడా ఒత్తిడి పెరగడంతో వారు ప్రభుత్వ పెద్దలకు స్థానిక ఇబ్బందులను విన్నవిస్తున్నారు. ఈ క్రమంలో పినపాక నియోజకవర్గ పరిధిలోని భూములకు సైతం సాగునీరు అందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది. దీంతో వారు మెయిన్ కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూటరీ కాల్వలతో ఏయే ప్రాంతాలకు సాగునీరు అందించే అవకాశాలున్నాయనే వివరాలతో సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. కాగా, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల తవ్వకానికి ఏ మేరకు భూమి అవసరమో గుర్తించాలని ప్రభుత్వం సూచించడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో భూసేకరణ చేసేందుకు పెసా గ్రామసభలు నిర్వహించాలని సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి మొదటి విడతగా బూర్గంపాడు మండలంలో మంగళవారం నుంచి పెసా గ్రామసభలు జరగనున్నాయి.

**గ్రామసభల ఆమోదంతో భూ సేకరణ..**

సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్యాకేజీ నంబర్ –1లో కాల్వల నిర్మాణంతో బూర్గంపాడు మండలంలో 9,800 ఎకరాలకు సాగునీరు అందనుంది. కాల్వల తవ్వకానికి మండలంలో 261 ఎకరాల భూమి అవసరం. ఈ భూమిని రైతుల నుంచి సేకరించేందుకు పెసా గ్రామసభల ద్వారా అనుమతి తీసుకోనున్నారు. ఇందులో కృష్ణసాగర్‌లో 13.37 ఎకరాలు, మోరంపల్లిబంజరలో 107.30, సోంపల్లిలో 46.01, ఇరవెండిలో 33.34, నాగినేనిప్రోలులో 60.10 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఆయా గ్రామాల్లో నేడు(మంగళవారం) గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామసభల ఆమోదం తర్వాత రైతుల నుంచి భూ సేకరణ చేపట్టి కాలువల నిర్మాణ ప్రక్రియ కొనసాగించనున్నారు. బూర్గంపాడు మండలంలో ఉన్న వ్యవసాయ భూమిలో 90 శాతం మేర వర్షాధారితంగానే రైతులు పంటలు సాగు చేస్తున్నారు. మిగతా 10 శాతం భూమిలో చిన్నపాటి చెరువులు, బోరు బావులు ఉన్నాయి. నీటి పారుదల సౌకర్యం లేక రైతులు ఆశించిన స్థాయిలో పంటలు పండించలేకపోతున్నారు. మండలంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు కూడా మూలన పడ్డాయి. దీంతో రైతులు బోరు బావులు, చెరువుల కిందనే రెండో పంట వేసుకుంటున్నారు. సీతారామ ప్రాజెక్టు నీరు అందితే రైతుల కల సాకారం కానుంది. కాగా, అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువుకు కూడా సీతారామ ప్రాజెక్ట్ నీటిని అందించి ఆరువేల ఎకరాలు సాగయ్యేలా ఇప్పటికే పనులు ప్రారంభించారు.

**చిగురిస్తున్న ఆశలు..**

కిన్నెరసాని రిజర్వాయర్ ఎడమ కాలువతో బూర్గంపాడు, పాల్వంచ మండలాలకు సాగునీరు అందించేందుకు 2006లో ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి శంకుస్థాపన చేశారు. బూర్గంపాడు మండలంలో ఏడు వేల ఎకరాలు, పాల్వంచ మండలంలో 3వేల ఎకరాలు సాగయ్యేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి పరిపాలన అనుమతులు తీసుకున్నారు. అవసరమైన భూసేకరణ చేసి, కాలువలు తవ్వి సాగునీరు కూడా విడుదల చేశారు. అయితే నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కాల్వల నిర్వహణ లోపభూయిష్టంగా మారి బూర్గంపాడు మండలానికి సాగునీరు నిలిచిపోయింది. మళ్లీ ఇప్పుడు సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లతో రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి. బూర్గంపాడుతో పాటు పాల్వంచ, ములకలపల్లి, కొత్తగూడెం మండలాలకు కూడా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లతో సాగునీరు అందించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు.

# ముక్కోటికి రండి

- దేవాదాయ శాఖ మంత్రికి ఈఓ ఆహ్వానం
- ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ, అధికారులు



ఆండాళ్ అమ్మవారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

**భద్రాచలం :** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా జనవరి 10వ తేదీ తెల్లవారుజామున జరిగే ఉత్తర ద్వార దర్శనానికి రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ఆహ్వాన పత్రిక అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, కూరాకుల జ్యోతి తదితరులతో కలిసి ఈఓ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు మంత్రి సురేఖకు వేదాశ్వీరచనం చేయగా ఈఓ స్వామివారి ప్రసాదం అందించారు. అనంతరం వైకుంఠ ప్రయుక్త ముక్కోటి అధ్యయనోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాలను మంత్రి సురేఖతో పాటు అధికారులు ఆవిష్కరించారు.

**ధనుర్మాసోత్సవాలు ప్రారంభం..**

భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆండాళ్ అమ్మవారికి తిరువీధి సేవ నిర్వహించారు. ధనుర్మాసంలో భాగంగా ప్రతీ రోజు పండితులు ఆలయంలో తిరుప్పావై ప్రవచనం చేయనున్నారు. 27వ రోజున కూడారై ఉత్సవాన్ని కనులపండువగా జరుపుతారు. చివరి రోజున గోదాదేవి – శ్రీరంగనాథ స్వామి వార్ల తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తారు.

**ముత్తంగి అలంకరణలో రామయ్య..**

అంతరాలయంలోని స్వామివారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించటం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకకు భక్తులు భారీగా హాజరయ్యారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, అధికారులు

# క్రీడలు జీవితంలో భాగం కావాలి

- సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ పాటిల్
- రాష్ట్రస్థాయిలో రాణించాలని పిలుపు



క్రీడలను తిలకిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

**కొత్తగూడెంఅర్బన్ :** ప్రతీ ఒక్కరు క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా పతకాలు సాధించడం కంటే ఆటలు ఆడుతూ ఆస్వాదించడంలోనే ఎంతో ఆనందం ఉంటుందన్నారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాణించాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించామని, అవసరమైన నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. యువతను ప్రోత్సహించేందుకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ప్రతీ రోజు వ్యాయామం చేయడం, ఆటలు ఆడడం ద్వారా ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. సీఎం కప్‌లో పాల్గొనే క్రీడాకారులకు సలహాలు, సూచనలు ఇస్తూ ప్రోత్సహించాలని కోచ్‌లను కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నరేష్, జిల్లా గిరిజన సంక్షేమ క్రీడా శాఖ అధికారి గోపాలరావు, డీవైఎస్‌ఓ పరంధామ రెడ్డి, పీడీలు కమలారాణి, రమేష్, శ్రీధర్, ఉదయ్, కాశీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన గ్రూప్–2



కొత్తగూడెం జూనియర్ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



సెయింట్ మేరీస్ పరీక్ష కేంద్రం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- రెండో రోజు 45.82 శాతం హాజరు నమోదు
- పటిష్ట బందోబస్తు నడుమ పరీక్ష నిర్వహణ
- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**కొత్తగూడెంఅర్బన్:** టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రూప్ – 2 పరీక్షలు ముగిశాయి. రెండోరోజు సోమవారం జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొదటి సెషన్ పరీక్షకు ఉదయం 9.30, మధ్యాహ్నం పరీక్షకు 2.30 తర్వాత వచ్చిన అభ్యర్థులను అనుమతించబోమని అధికారులు ప్రచారం నిర్వహించినా.. కొందరు ఆలస్యంగానే వచ్చారు. వారిని నిర్వాహకులు కేంద్రంలోకి వెళ్లనీయకపోవడంతో పరీక్ష రాయకుండానే వెనుదిరిగారు. ఇక మొదటి రోజు కంటే రెండో రోజు గైర్హాజరైన అభ్యర్థుల సంఖ్య పెరిగింది. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, మాల్ ప్రాక్టీస్ జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. అంతేకాక కొందరు అభ్యర్థులకు అవసరమైన సూచనలు చేసి, సాయం అందించారు.

**కలెక్టర్ పాటిల్ తనిఖీ..**


గ్రూప్–2 పరీక్ష నిర్వహణకు జిల్లాలోని 38 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండడంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్ కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తనిఖీ చేసి ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రెండో రోజు ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు 13,466 మంది అభ్యర్థులకు గాను 6,170 మంది హాజరు కాగా, 7,296 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 45.82గా నమోదైంది. మధ్యాహ్నం పరీక్షకు 6,173 మంది హాజరు కాగా, 7,218 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. దీంతో 45.84 హాజరు శాతం నమోదైంది. పలు కేంద్రాల్లో గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు, దివ్యాంగులు పరీక్ష రాశారు. దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్ష కేంద్రాల్లో వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు కొందరికి వైద్య సేవలు అందించారు.

## రోడ్డు విస్తరణకు ఎన్‌హెచ్ అధికారుల పరిశీలన

**టేకులపల్లి :** కొత్తగూడెం నుంచి వలిగొండ మీదుగా హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 930 పీ) నిర్మాణానికి సంబంధించి అధికారులు సోమవారం టేకులపల్లిలో పరిశీలన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.700 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. కాగా, ఏడాది క్రితమే ఇల్లెందు నుంచి కొత్తగూడెం వరకు 44 కిలోమీటర్ల రోడ్డుకు సంబంధించిన నిర్వాసితులను గుర్తించి, పత్రికా ప్రకటన కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ ఏఈ ఆలీ ఆధ్వర్యంలో సిబ్బంది టేకులపల్లి ప్రధాన రహదారి వెంట నిర్వాసితుల ఆస్తులను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు ఏ మేరకు తొలగించాల్సి ఉంటుంది, వాటి అంచనా విలువ ఎంత, ఎంతమంది నిర్వాసితులవుతారు అనే వివరాలు నమోదు చేసుకున్నారు. దీంతో నిర్వాసితుల్లో ఆందోళన మొదలైంది. త్వరలోనే ఎన్‌హెచ్ నిర్మాణ పనులు మొదలవుతాయని, నష్టపరిహారం ఎంత ఇస్తారనే చర్చలు కూడా ప్రారంభమయ్యాయి.

# రద్దయిన రైళ్లను పునరుద్ధరించండి

**సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు శ్రీనివాసరెడ్డి**



అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస రెడ్డి

**కొత్తగూడెంఅర్బన్ :** కరోనా సమయంలో రద్దయిన కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట – డోర్నకల్ ప్యాసింజర్‌తో పాటు ఇతర రైళ్లను పునరుద్ధరించాలని, ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాయాలని సికింద్రాబాద్ డివిజన్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై. శ్రీనివాస రెడ్డి అధికారులకు సూచించారు. బోర్డు సభ్యుడిగా నియమితులైన తర్వాత తొలిసారిగా సోమవారం ఆయన కొత్తగూడెం రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భద్రాచలం రైల్వే లైన్ పనులతో పాటు మణుగూరు – డోర్నకల్ డబుల్ రైల్వే ట్రాక్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. కొత్తగూడెం నుంచి పుణ్యక్షేత్రమైన తిరుపతికి స్పెషల్ ట్రైన్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. కొత్తగూడెం – బల్లార్షా సింగరేణి రైలులో సరైన సీట్లు, టాయిలెట్లు వంటి సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రైల్వే స్టేషన్‌లో క్లీన్ అండ్ గ్రీన్, వెయిటింగ్ హాళ్లు, వాహనాల పార్కింగ్, పరిశుభ్రమైన తినుబండారాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఏరియా అధికారి మీనా మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌స్పెక్టర్ పాషా, సివిల్ ఇంజనీర్ జావేద్, నాయకులు బాలప్రసాద్, రాజేష్, శ్యామ్, మాజీ స్టేషన్ మాస్టర్ చలం తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రత్యేకం'.. ప్రగతి శూన్యం

- అస్తవ్యస్తంగా ప్రత్యేకాధికారుల పాలన
- నామమాత్రంగానే జిల్లా పరిషత్ నిర్వహణ
- పంచాయతీల్లోనూ ఎక్కడి సమస్యలు అక్కడే..
- అదనపు బాధ్యతలతో సతమతమవుతున్న అధికారులు



విద్యానగర్ పంచాయతీ పరిధిలో నిర్వహణ లేక వీధుల్లో పేరుకుపోయిన చెత్త

**చుంచుపల్లి:** జిల్లా, మండల పరిషత్‌లతో పాటు గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో చెప్పుకోదగిన ప్రగతి కనిపించడం లేదు. వారు చుట్టచూపుగా వచ్చి అదనపు విధులు పర్యవేక్షిస్తుండడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. తమ సొంత శాఖల పని ఒత్తిడితో సతమతమవుతున్న అధికారులు.. 'ప్రత్యేక' విధులపై అంతగా దృష్టి పెట్టలేకపోతున్నారు. జిల్లా, మండల పరిషత్ పాలక మండళ్ల పదవీకాలం ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో ముగిసింది. జెడ్పీకి ప్రత్యేకాధికారిగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బాధ్యతలు స్వీకరించగా, వివిధ శాఖల జిల్లా అధికారులకు మండలాల బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయా అధికారులు మండలాలకు ఎప్పుడు వస్తారో తెలియడం లేదు. దీంతో జిల్లా, మండల పరిషత్‌లలో పాలన గాడి తప్పుతోంది. ఇక గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. గ్రామాల్లో కార్యదర్శులే అన్నీ తామై పనిచేస్తున్నారు. ఇక జెడ్పీ పాలకమండలి కొనసాగిన ఐదేళ్లలోనూ రూ.51 కోట్ల వ్యయంతో మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టారు. మండలాల పరిధిలో ఇంకా చేపట్టాల్సిన పనులు చాలా ఉన్నాయి. జెడ్పీ ప్రత్యేకాధికారిగా ఉన్న కలెక్టర్ అయినా నిధుల మంజూరుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కొరవడిన పర్యవేక్షణ..**

జిల్లాలో 481 గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పల్లెల అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రత్యేకాధికారుల పాలనలో నిర్వహణ, పర్యవేక్షణ కొరవడి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. విద్యుద్దీపాలు, బోరు మోటార్ల మరమ్మతులు మూలనపడ్డాయి. కనీసం ట్రాక్టర్లకు డీజిల్ సమకూర్చుకోలేని దుస్థితి నెలకొంది. వచ్చే అరకొర నిధులు కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులకే సరిపోవడం లేదు. సర్పంచ్, పాలకవర్గాల బాధ్యతలు జనవరి 31న ముగియగా.. వారి స్థానాల్లో నియమితులైన ప్రత్యేకాధికారులు పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో కార్యదర్శులే జవాబుదారీగా పనిచేస్తూ అప్పులు చేసి మరీ పాలనను నెట్టుకొస్తున్నారు. పంచాయతీల నిర్వహణకు కేంద్రం అందించే 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులే ఆధారంగా నిలుస్తుంటాయి. గ్రామాలకు ఏడాదిన్నర కాలంగా ఎస్ఎఫ్‌సీ నిధులు సక్రమంగా రావడం లేదు. దీంతో స్థానిక ఆదాయ వనరులే దిక్కయ్యాయి. పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్నులు, గృహ నిర్మాణ అనుమతులు, వ్యాపార లైసెన్స్ రుసుముల రూపంలో కొంత ఆదాయం సమకూరుతోంది. చిన్న పంచాయతీలకు ఆ అవకాశం లేదని, చాలామంది ఇంటి పన్నులు సైతం చెల్లించడం లేదని కార్యదర్శులు చెబుతున్నారు. అటు నిధుల లేమితో ట్రాక్టర్ ఫైనాన్స్ వాయిదాలు, డీజిల్, బోరు మోటార్ల మరమ్మతులు, కరెంట్ బిల్లులు, విద్యుత్ దీపాలు, కార్మికుల వేతనాలు చెల్లించడం గగనమవుతోందని వాపోతున్నారు. చాలా మంది పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి, కొందరు సొంత డబ్బులు వెచ్చించి పాలన నెట్టుకొస్తున్నారు. అయితే ఇలా తాము మాత్రం ఎంతోకాలం చేయలేమని, ప్రభుత్వం నుంచి నిధులు వస్తే తప్ప పని చేయలేమని అంటున్నారు.

**సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయి**



గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత అనేది ప్రధాన సమస్యగా మారింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది అనేది వాస్తవం. కొన్ని రోజులుగా పంచాయతీ కార్యదర్శులే అన్నీ తామై పనిచేస్తున్నారు. ఈ పాలనా పరమైన సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయి. త్వరలోనే గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తుందని భావిస్తున్నాం.

– చంద్రమౌళి, డీపీఓ

# ‘బొజ్జాయిగూడెం’లో కిష్కింధకాండ

- అటవీ ప్రాంతంలో ఇల్లెందు–టేకులపల్లి రహదారిపై కోతుల పరుగులు
- వాహనాలకు అడ్డు రావడంతో తరచూ ప్రమాదాలు
- నిర్వహణలేక ఫుడ్‌కోర్టుల్లో ఎండిపోయిన పండ్ల మొక్కలు
- అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరుతున్న వాహనదారులు



ప్రధాన రహదారిపై వాహనాలకు అడ్డుగా పరిగెడుతున్న వానరాలు

**ఇల్లెందురూరల్:** ఇల్లెందు–టేకులపల్లి సరిహద్దున ఉన్న బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో ఎక్కడ చూసినా వానరాలే కనిపిస్తున్నాయి. రహదారిపై వాహనాలకు అడ్డుగా పరుగులు తీస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో కొందరు గాయపడుతుండగా, మరికొందరు మృత్యువాత పడుతున్నారు. కోతులు కూడా గాయపడుతున్నాయి. ఇల్లెందుమార్గంతోపాటు అటవీ ప్రాంతం నుంచి వెళ్తున్న పలు రహదారుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**ఆహారం దొరకక..**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వృక్షాలను కొట్టేస్తుండటంతో వానరాలకు ఆవాసాలు, ఆహారం కరవయ్యాయి. దీంతో గ్రామాల్లోకి వస్తున్నాయి. కోతులతో స్థానికులు ఇబ్బందులు పడలేక స్థానిక సంస్థల అధికారులు ప్రత్యేక బృందంతో పట్టిస్తున్నారు. వాటిని తిరిగి సమీపంలోని అటవీ ప్రాంతాల్లో వదిలేస్తుండగా, ఆహారం దొరకక అవి ప్రధాన రహదారులపై తిరుగుతున్నాయి. కొందరు పండ్లు, ఇతర ఆహార పదార్థాలు వేస్తుండటం వల్ల కూడా అవి నిత్యం రోడ్ల వెంటే ఉంటున్నాయి. అయితే అటవీ ప్రాంతంలో ఆహారం వేయొద్దని అధికారులు సూచించినా వృథా ప్రయాసే అయ్యింది. కాగా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం, టేకులపల్లి మండలం 9వ మైలుతండా మధ్యలోని అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసి, మొక్కలు నాటారు. కానీ నిర్వహణ లేక అవి ఎండిపోయాయి. ఆ తర్వాత ఇల్లెందు రేంజ్ అధికారులు మరోచోట ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేసినా నిర్వహణ కొరవడింది.

**వందల సంఖ్యలో సంచారం**

ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో ప్రధాన రహదారి వెంట, అడవికి సమీపంలో ఉన్న గ్రామాల్లో కోతుల సంచారం విపరీతంగా పెరిగింది. వందల సంఖ్యలో కోతులు దండయాత్ర మాదిరిగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటి భయంతో వ్యవసాయ క్షేత్రాల్లో వాణిజ్య పంటలను సాగు చేసుకునేందుకు భయపడుతున్నారు. గ్రామాల్లో ఇంటి పెరడులో కూరగాయల చెట్లు కూడా వేసుకోవడంలేద. దుకాణాలు, ఇళ్లకు రక్షణగా ఇనుప ఊచలు బిగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఒంటరిగా రోడ్లపై వెళ్లాలంటే చేతిలో కర్ర సహాయం తప్పడం లేదు.

**అధికారులు స్పందిస్తే మేలు**

మండలంలోని బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో ఆదివారం సింగరేణి కాంట్రాక్ట్ ఉద్యోగి రాధాకృష్ణ బైక్‌కు కోతులు అడ్డుగా రావడంతో చెట్టుకు ఢీకొని మృతిచెందాడు. రెండేళ్ల క్రితం కొత్తూరు గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగి ఊకే రామయ్య కోయగూడెం ఓసీలో విధులు వెళ్లొస్తుండగా బైక్‌కు కోతులు అడ్డు రావడంతో ప్రమాదం జరిగి మృతి చెందాడు. ఏడాది క్రితం హనుమంతులపాడు గ్రామానికి చెందిన చీమల ప్రభాకర్, కృష్ణకుమారి దంపతులను కోతులు వెంబడించడంతో బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు అటవీ ప్రాంతంలో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అటవీ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులు నిర్లక్ష్యం వీడి కోతుల సంచారాన్ని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

### నివారణ చర్యలు తీసుకుంటాం



ఇల్లెందు, టేకులపల్లి మండలాల సరిహద్దులో కోతుల సంచారం విపరీతంగా పెరిగింది. వాహనాలకు అడ్డుగా పరిగెత్తడంతో దాడులకు దిగుతున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం

–చంద్రభాను, డీఎస్పీ, ఇల్లెందు

### రోడ్లపై ఆహారం వేయొద్దు



ప్రధాన రహధారి వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకులు కోతులకు ఆహారం వేయొద్దు. ఈ కారణంగానే కోతులు వాహనాల వెంట పడుతున్నాయి. కోతులు తిరిగి అడవిలోకి వెళ్లేలా ప్రస్తుతం 12 హెక్టార్లలో ఫలాలనిచ్చే మొక్కలు పెంచుతున్నాం.

–ప్రసాద్, ఎఫ్ఆర్‌వో, ఇల్లెందు రేంజ్

## సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా సింగరేణి విద్యాసంస్థలు



విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్రటరీ శ్రీనివాస్

**ఇల్లెందు:** సింగరేణి విద్యాసంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలు సాగుతున్నాయని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ వెల్లడించారు. ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులను సామర్థ్యాలను పరీక్షించాక మాట్లాడారు. సీఎండీ బలరామ్ మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సింగరేణిలో మహిళా డిగ్రీ కళాశాల, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలో మెరుగైన బోధన అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఏరియా జీఎం వీసం కృష్ణయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విష్ణుప్రియ, నరసమ్మ, రవీందర్, బి శ్రీనివాసరావు, ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిండుకుండలా తాలిపేరు





నిండా నీటితో కళకళలాడుతున్న తాలిపేరు ప్రాజెక్టు (ఇన్‌సెట్) 74మీటర్లుగా నమోదైన నీటిమట్టం

**ప్రాజెక్టులో 74 మీటర్ల మేర పూర్తి స్థాయి నీటిమట్టం**

**చర్ల:** మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. వర్షాకాలం ముగిసి మూడు నెలలు కావొస్తుండటం, ఖరీఫ్ సీజన్‌లో చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని పొలాలకు సాగునీరు విడుదల చేసినా డిసెంబర్ ఆఖరుకు ప్రాజెక్టులో 74మీటర్ల మేర పూర్తిస్థాయి నీటిమట్టం నమోదు కావడం విశేషం. ఎగువ నుంచి కొద్దిమేర వస్తున్న ఇన్‌ఫ్లోను ఒడిసి పడుతూనే కుడి, ఎడమ ప్రధాన కాల్వ ద్వారా ఖరీఫ్ పంటలకు సాగునీరు విడుదల చేశారు. ఇదే సమయాన ఖరీఫ్ చివరి నాటికి సైతం పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండేలా ప్రయత్నించి సఫలమైన ప్రాజెక్టు అధికారులను రైతాంగం అభినందిస్తోంది. కాగా, జలకళను సంతరించుకున్న ప్రాజెక్టు అందాలను వీక్షించేందుకు సమీప గ్రామాలతో పాటు దుమ్ముగూడెం, వెంకటాపురం, భద్రాచలం ప్రాంతాల ప్రజలు తరలివస్తున్నారు.

## కట్లేరు నుంచి ఇసుక తరలింపునకు అనుమతి



రేవును పరిశీలించి మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషాశారద

**ఎర్రుపాలెం:** మండలంలోని తక్కెళ్లపాడులోని కట్లేరు నుంచి ఇసుక తరలింపునకు అనుమతి లభించింది. స్థానిక అవసరాలకు ఇసుక కొరత ఎదురవుతోందని పలువురు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచనలతో మహిళా సంఘాల ద్వారా ఇసుక రవాణాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ ఎం.ఉషాశారద, మైనింగ్ ఆర్ఐ నాగరాజు ఇసుక రేవును ప్రారంభించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఇసుక రవాణాకు ప్రభుత్వం అనుమతి లభించిందని తెలిపారు. ఇదేసమయాన అక్రమ రవాణాకు అవకాశం లేకుండా ఐకేపీ సిబ్బంది పర్యవేక్షిస్తారని చెప్పారు. ఐకేపీ ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, జియోలజిస్టులు సంతోష్, ప్రమోద్ నర్సింహారావు, సీసీ శాంతకుమారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు నాయకులు శీలం ప్రతాపరెడ్డి, ముక్కర రామకృష్ణారెడ్డి, అయిలూరి రవీందర్‌రెడ్డి, బండారు నర్సింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, తలపురెడ్డి నాగిరెడ్డి, గుడేటి బాబూరావు, రాజీవ్‌గాంధీ పాల్గొన్నారు.

## కష్టమైనదే ముందు చదవండి

**సత్తుపల్లి:** ఇష్టమైనది మాత్రమే నిరంతరం చదివితే కష్టమైన సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించడం కష్టమవుతుందని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ తెలిపారు. సత్తుపల్లిలోని గంగారంలో దాసరి వీరారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక ఆయన మాట్లాడారు. కష్టమైన సబ్జెక్టులో పాఠాలను సైతం అర్థం చేసుకునేలా చదివితే ఇష్టం పెరుగుతుందన్నారు. తద్వారా అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించొచ్చని తెలిపారు. శ్రద్ధగా వినడం, చదవడమేకాక రాయడం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

**ఖమ్మం సహకారనగర్:** విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్ వద్ద వారి దీక్షా శిబిరాన్ని సోమవారం వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, కల్యాణం వెంకటేశ్వరరావు, రామాంజనేయులు సందర్శించి మద్దతు ప్రకటించారు. నాయకులు ఝాన్సీ సౌజన్య, మహబూబ్ పాషా పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యం



మాట్లాడుతున్న జీఎం నారాయణరావు

**సత్తుపల్లిరూరల్:** సింగరేణిలో ప్రతీ ఉద్యోగి, కార్మికుడు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆర్‌అండ్‌డీ జీఎం ఆర్.నారాయణరావు సూచించారు. సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో రక్షణ కమిటీ బృందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా ట్రేడ్ పరీక్షలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందించాక జీఎం మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం మేర బొగ్గుఉత్పత్తి సాధనపై దృష్టి సారించడమే కాక రక్షణ సూత్రాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓ నర్సింహారావు, వివిధ విభాగాల ఉద్యోగులు, నాయకులు ఎస్.సుధాకర్‌రావు, బాలాజీ, సునీల్‌వర్మ, రామకృష్ణ, లక్ష్మీరాజు, భాస్కర్, లోక్‌నాథ్‌రెడ్డి, శ్రీరాం, తిరుపతి, కిషన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, రమణారావు, రామకృష్ణ, గోపికిషోర్, విజయ్ సందీప్ పాల్గొన్నారు.

# కార్మికరత్న అవార్డు ప్రదానం

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి కొత్తగూడెం ఏరియా కార్మిక సంఘం నాయకుడు రాసూరి శంకర్‌కు బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్‌ఏ) కార్మికరత్న అవార్డు ప్రదానం చేసింది. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయనకు బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు తదితరులు అవార్డు అందజేసి సన్మానించారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, ఓబీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న శంకర్ చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు డాక్టర్ యు.సుబ్రమణియన్, ఎం.ఎం.గౌతమ్, హనుమాండ్ల విష్ణు, నల్లా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**సులోచనకు బెస్ట్ సర్వీస్ సొసైటీ అవార్డు**



అవార్డు అందుకుంటున్న సులోచన

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెంని శ్రీపాండురంగ భజన మందిర్‌లో గ్రేడ్–1 కార్య నిర్వహణాధికారిగా పనిచేస్తున్న కె.సులోచన బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు–2024 అందుకుంది. ఆదివారం న్యూఢిల్లీలో ఆంధ్ర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ చైర్మన్ నల్లా రాధాకృష్ణ అవార్డును ప్రదానం చేశారు.

## జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు రోహిత్‌శర్మ

**కామేపల్లి:** మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో మండలంలోని పండితాపురానికి చెందిన వంగివరపు రోహిత్‌శర్మ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ జట్టు ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఈనెల 26 నుంచి జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ప్రస్తుతం రఘునాథపాలెం మండలం బూడిదంపాడులోని లిటిల్ బర్డ్స్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రోహిత్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్**



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏపీఓ జనరల్, అధికారులు

**భద్రాచలం:** గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్‌లో భాగంగా ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించాక యూనిట్ అధికారులతో సమీక్షించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చూడాలని, వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక తరగతులను నిర్వహించాలని తెలిపారు. కాగా, తొమ్మిది నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఏఎన్ఎంలు వినతిపత్రం అందజేయగా, మరికొందరు వివిధ సమస్యలపై వినతిపత్రాలు, పథకాల కోసం దరఖాస్తులు సమర్పించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, వివిధ శాఖల అధికారులు ఉదయ్‌కుమార్, మునీర్‌పాషా, ఆదినారాయణ, ప్రమీలబాయి తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి సీపీఎం ఖమ్మం జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

**ఖమ్మంమయూరిసెంటర్:** సీపీఎం ఖమ్మం జిల్లా 22వ మహాసభలు సత్తుపల్లిలో ఈనెల 18, 19వ తేదీల్లో జరగనున్నాయని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఈ మహాసభలకు 600మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారని చెప్పారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ ఉద్యమాల రూపకల్పనకు మూడేళ్లకోసారి గ్రామం నుంచి జాతీయస్థాయి వరకు మహాసభలు నిర్వహించి, నూతన కార్యవర్గాలు ఎన్నుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జరగనున్న జిల్లా మహాసభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ.వీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు ఎస్.వీరయ్య, బి.వెంకట్, పోతినేని సుదర్శన్, సాయిబాబు తదితరులు హాజరవుతారని అన్నారు. మహాసభల ప్రారంభానికి ముందు సత్తుపల్లి డివిజన్ కార్యాలయం నుంచి మహాసభల ప్రాంగణం వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ సభల్లో ప్రజల సమస్యలు, పాలకుల విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గ్రానైట్ పరిశ్రమ సంక్షోభం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపన, ఖమ్మంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిమ్స్ తరహా వైద్య కళాశాల, ఆరు గ్యారంటీల అమలుపై తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, నెల్లూరి వీరబాబు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి అక్రమార్కులపై విచారణ

**నకిలీ ధ్రువపత్రాలపై పోలీసుల ఆరా.. సీపీకి నివేదిక**

**వైరా:** వైరా నియోజకవర్గ కేంద్రంలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా నగదు కాజేసేందుకు నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా జరిగిన విఫలయత్నంపై విచారణ కొనసాగుతోంది. వరుడు, వధువుగా పెనుబల్లి మండలానికి చెందిన సోమ్లానాయక్, అదే మండలానికి చెందిన ఓ యువతి పేరుతో వారి బంధువు వెంకన్న వైరాలోని ఉపేందర్‌తో కలిసి కొద్దిరోజుల క్రితం నకిలీ ఆహ్వాన పత్రిక, ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, వివాహ ధ్రువీకరణ పత్రం సృష్టించి తహసీల్‌లో దరఖాస్తు చేసుకున్న విషయం విదితమే. అయితే, రెవెన్యూ ఉద్యోగులు కనీస విచారణ కూడా చేయకుండా దరఖాస్తును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పంపించారు. అక్కడ క్యాంపు కార్యాలయ ఉద్యోగి గుగులోత్ రాము పత్రాలన్నీ నకిలీవని గుర్తించి ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేయగా వైరా సీఐ సాగర్ ఆధ్వర్యాన విచారణ చేస్తున్నారు. అంతేకాక నివేదికను ఇప్పటికే పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌కు సమర్పించినట్లు తెలిసింది. కాగా, తల్లాడలో నకిలీ వివాహపత్రిక ముద్రించడం, వైరాలో ఓ ప్రజాప్రతినిధి ఆకుపచ్చ రంగు పెన్నుతో సంతకం చేసి ఫార్వర్డ్ చేయడం.. ఆపై తహసీల్ ఉద్యోగులు విచారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈనేపథ్యాన విచారణ అనంతరం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయాన బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిని కేసు తప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఉద్యోగి

## యువకుడి ఆత్మహత్య



పవన్ ప్రదీప్ (ఫైల్)

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన కట్టా వెంకటేశ్వరరావు, సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు పవన్ ప్రదీప్‌కు ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనంగా మారి ఇంటర్మీడియట్ ఫెయిలయ్యాడు. నిత్యం మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ కొద్దిగా మతిస్థిమితం కోల్పోయాడు. తల్లి పలుమార్లు వైద్యులకు చూపించినా మార్పు రాలేదు. గత శుక్రవారం కూడా మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతుండగా తల్లి ఫోన్ లాక్కుంది. దీంతో కోపంతో ప్రదీప్ సైకిల్‌పై బయటకు వెళ్లాడు. ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలన చేపట్టారు. సోమవారం బ్రిడ్జి పాయింట్‌లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించగా పార్కు వద్ద సైకిల్ నిలిపి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకిన దృశ్యం కనిపించింది. దీంతో గజ ఈతగాళ్ల సాయంతో గోదావరిలో గాలింపు చేపట్టగా, వినాయకుడి నిమజ్జన ఘాట్ వద్ద నీటిలో ప్రదీప్ మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**అశ్వాపురం:** మండల పరిధిలోని మొండికుంట గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు మండలం శేషగిరినగర్‌కు చెందిన లింగమూర్తి(45) కొత్తగూడెం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. మొండికుంట గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనం రాగా, అప్పటికే ఆయన మృతి చెందాడు.

## ప్రెజర్‌బాంబు పేలి ఆదివాసీ...

**చర్ల:** పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి పేలడంతో అడవిలో కట్టెలు ఏరుకునేందుకు వెళ్లిన ఓ ఆదివాసీ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా బార్సూర్ పోలీస్‌స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో ఓ ఆదివాసీ వ్యక్తి కట్టెలు ఏరుకునేందుకు సోమవారం వెళ్లాడు. కూంబింగ్‌కు వచ్చే పోలీసు బలగాలను మట్టుబెట్టేందుకు ఆ ప్రాంతంలో మావోయిస్టులు ప్రెజర్‌బాంబులు ఏర్పాటు చేయగా గమనించిన సదరు వ్యక్తి దాన్ని తొక్కడంతో పేలగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న బార్సూర్ పోలీసులు బాంబ్‌స్క్వాడ్ బృందంతో చేరుకుని తనిఖీల అనంతరం మృతదేహాన్ని తరలించారు.

## ప్రమాదవశాత్తు ఏటిలో పడి వలస కూలీ...

**బోనకల్:** ప్రమాదవశాస్తు వైరా ఏటిలో పడిన వలస కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో జరిగింది. ఎస్ఐ మధుబాబు తెలిపిన వివరాలు... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీర్‌సింగ్(55) కూలి పనుల కోసం గ్రామానికి వచ్చాడు. ఆయనతో పాటు మరికొందరు వైరా ఏటి పక్కన గుడిసెలు వేసుకున్నారు. ఈనెల 14న స్నానం చేయడానికి ఏటి వద్దకు వెళ్లిన బీర్‌సింగ్ గుంతలో పడిపోయాడు. చాలాసేపటి వరకు ఆయన రాకపోవడంతో కుమారుడు సుకుల్‌సింగ్ ఫిర్యాదుతో పోలీసులు గాలిస్తుండగా సోమవారం ఆయన మృతదేహం బయటపడింది. ఈమేరకు మృతదేహానికి మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

## క్లుప్తంగా

### పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

**భద్రాచలంటౌన్:** పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్‌లో జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. అనంతరం ఈ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వి.మల్లేష్, లకావత్ వెంకటేశ్వర్లు, జీవీ రామిరెడ్డి, శివరాకృష్ణ, వెంకటకృష్ణ, మాధవరెడ్డి, అబ్దుల్ ఫరూక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### అనంతారంలో అధికారుల పరిశీలన



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

**జూలూరుపాడు:** మండలంలోని అనంతారం గ్రామాన్ని సోమవారం అధికారులు సందర్శించారు. నెల రోజుల్లోనే పాలెపు సాహితీ(8), పూనెం ప్రేమలత(30) కిడ్నీవ్యాధితో మృతి చెందడంతో అప్రమత్తమైన మండలాధికారులు గ్రామంలో పర్యటించి, కిడ్నీ బాధితులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జూలూరుపాడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది కిడ్నీ బాధితుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తాగునీరు, ఆహారపు అలవాట్లు, పాటించాల్సిన నియమాలను వివరించారు. తాగునీటిని పరిశీలించామని, ఫ్లోరైడ్ సమస్య లేదని అన్నారు. త్వరలో గ్రామసభ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంపీఓ టి.తులసిరామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్కే యాస్మిన్, సీహెచ్‌ఓ రామకృష్ణ, సిబ్బంది రత్నకుమార్, కృష్ణ, సావిత్రి, పూనెం ఝాన్సీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, కొర్సా రమేష్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడు గైర్హాజర్!



మూసి ఉన్న పాఠశాల, ఆవరణలో విద్యార్థులు

**కరకగూడెం:** మండల పరిధిలోని వెంకటాపురం గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సోమవారం విధులకు గైర్హాజరయ్యాడు. దీంతో విద్యార్థులు ఆవరణలో ఆడుకుంటూ కనిపించారు. ఇదే విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు పది రోజులుగా విధులకు రావడంలేదని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై కాంప్లెక్స్ హెచ్ఎం నాగేశ్వరరావును వివరణ కోరగా.. సోమవారం గైర్హాజరుపై సదరు ఉపాధ్యాయుడు ముందస్తుగా సమాచారం ఇవ్వలేదని, అందువల్లే మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయలేదని తెలిపారు. పది రోజులుగా గైర్హాజరవుతున్నట్లు గ్రామస్తులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు.

### కుటుంబం చెంతకు చేరిన వృద్ధురాలు

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చి దారి తప్పిన వృద్ధురాలిని చేరదీసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతలబోరుకు చెందిన 70ఏళ్ల వృద్ధురాలు సిద్దుల ఈశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు ఈనెల 10న ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, 12వ తేదీన ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన ఆమె తప్పిపోగా ఖమ్మం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఖమ్మం టేకులపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఆమె ఒంటరిగా తిరుగుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆమెను చేరదీసి అన్నం ఫౌండేషన్‌లో అప్పగించారు. అక్కడ ఆరా తీయగా ఈశ్వరమ్మ కుటుంబం వివరాలు చెప్పడంతో సోమవారం వారిని పిలిపించి అప్పగించారు.

### గన్నీ బ్యాగ్‌ల కొరత రావొద్దు

**ఏన్కూరు:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌ల కొరత ఎదురుకాకుండా ముందస్తుగా సమకూర్చుకోవాలని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. మండలంలోని తిమ్మారావుపేట, ఏన్కూరు, బురదరాఘవాపురంల్లో ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేసారు. అలాగే, లచ్చగూడెం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడగా బస్తాలు లేకపోవడంతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని డీఏఓకు చెప్పారు. దీంతో స్పందించిన ఆయన సివిల్ సప్లయీస్ అధికారులతో మాట్లాడగా మంగళవారం నాటికి బస్తాలు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ నర్సింహరావు, ఏఈఓలు బాలకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



| పామాయిల్ గెలలు | |
|---|---|
| టన్ను ధర | రూ.20,413 |